కర్ణభేరి పగిలేలా.. ప్రాణాలు పోయేలా!

- ప్రాణాలు తీస్తున్న డీజే సిస్టం
- ప్రతి ఉత్సవంలో తప్పని సరైన డీజేలు
- అధిక శబ్దం ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నా పట్టని వైనం
- చర్యలు చేపట్టాలంటూ ప్రజల విన్నపాలు



రాజంపేట టౌన్ : ప్రస్తుతం కొన్ని ఉత్సవాలు, జాతర్లు, తిరునాళ్లలు జరుగుతున్న సందర్భంగా డీజేలను ఏర్పాటు చేయడం తప్పని సరైంది. డీజే ద్వారా వచ్చే మ్యూజిక్‌కు డ్యాన్స్ చేసే వారికి ఉత్సాహంగా, ఆనందంగా ఉంటుంది. కాని ఆ శబ్దం కొందరికి ప్రాణసంకటంగా మారుతోంది. పలు ప్రాంతాల్లో డీజేల వద్ద నృత్యం చేస్తూ మృతి చెందుతుండటం వంటి సంఘటనలు చూస్తున్నాం. తాజాగా ఈనెల 6వ తేదీ విశాఖ జిల్లాలో దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవిని ఊరేగించే సమయంలో అక్కడి నిర్వాహకులు డీజేని ఏర్పాటు చేశారు. డీజేకి దగ్గరగా ఉండి డ్యాన్స్ చేస్తూ ఓ వ్యక్తి కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో రాజస్థాన్‌లో డీజే శబ్దానికి పిట్టగోడ కూలి పలువురు మృతి చెందిన సంఘటన కూడా జరిగింది. డీజే శబ్దం వల్ల వినికిడిలోపం, గుండెపోటు వచ్చే అవకాశం ఉందని ఒకవైపు వైద్యులు మీడియా, సోషల్ మీడియా ద్వారా హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ఉత్సవాల్లో, జాతరలలో, తిరునాళ్లలో డీజేలు ఏర్పాటు చేస్తున్నప్పటికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రభుత్వం కూడా డీజే సౌండ్‌పై కఠినమైన విధానం అవలంబించాల్సిన అవసరం ఉందనే వాదన ప్రజల నుంచి వినిపిస్తోంది.

వివిధ రకాల ఆరోగ్య సమస్యలు

సాధారణంగా రోడ్డుపై వెళ్లే సమయంలో వాహనాల వల్ల పెద్ద శబ్దాలు వస్తేనే ఇబ్బందికరంగా ఉంటుంది. అయితే గంటల తరబడి రోడ్లపై డీజే శబ్దాలు ఉంటే రహదారిలో వెళ్లే వారి పరిస్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. డీజే శబ్దం వల్ల హృద్రోగులకు ప్రాణాపాయం కూడా ఉంటుంది. అలాగే వృద్ధులు, పిల్లలు, గర్భిణులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశంఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా వినికిడి లోపం, గుండెపోటు వంటి సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

అమలు కాని మార్గదర్శకాలు

శబ్దకాలుష్యంపై మార్గదర్శకాలు ఉన్నప్పటికి అవి ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. ప్రధానంగా ఉత్సవాలు, జాతర్లు, తిరునాళ్లల సందర్భంగా డీజేలు ఏర్పాటు చేస్తుంటారు. ఆ సమయంలో డీజే వల్ల శబ్దం అధికంగా ఉంటుంది. బందోబస్తుగా ఉండే పోలీసు అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో చిన్న, చిన్న ఉత్సవాలకు సైతం డీజేలను ఏర్పాటు చేస్తున్నారు.

మార్గదర్శకాలు ఇలా..

- బహిరంగ ప్రదేశాల్లో 10 డెసిబుల్స్‌కు మించి శబ్దం చేయరాదు
- ప్రైవేట్ ప్రదేశాల్లో డీజేలను పెట్టకూడదు
- లిఖిత పూర్వక అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు, సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేయకూడదు
- నిషిద్ధ ప్రాంతాలుగా గుర్తించిన ప్రదేశాల్లో సంగీత ధ్వనులు, డ్రమ్స్ కొట్టడం ఇతర శబ్దాలు చేయకూడదు
- సినిమా థియేటర్లలో సైతం 65 డెసిబుల్స్‌కు మించి శబ్దం ఉండకూడదు
- హాస్పిటల్స్, విద్యా సంస్థలు, దేవాలయాలు, న్యాయ స్థానాలకు వందమీటర్లలోపు డీజేలు కాని ఏ ఇతర సౌండ్ సిస్టంలను ఏర్పాటు చేయకూడదు

గుండెపోటు వచ్చే అవకాశం



డీజే శబ్దాల వల్ల గుండె సమస్యలు ఉన్నవారికి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చే ప్రమాదముంది. మనిషికి చెవిలో కర్ణబేరి సున్నితంగా ఉంటుంది. మోతాదుకు మించి శబ్దం వింటే కర్ణబేరి దెబ్బతిని వినికిడిలోపం వస్తుంది. ముఖ్యంగా డీజే సౌండ్ ఎక్కువగా ఉంటుంది అందువల్ల గుండె జబ్బులతో బాధపడేవారు, చిన్నపిల్లలు, గర్భిణులకు ఆరోగ్య పరంగా ఇబ్బందులు తలెత్తే అవకావముంది. ప్రజలు డీజే సౌండ్‌లకు దూరంగా ఉండాలి.

– డాక్టర్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట

నిరుపయోగంగా గెస్ట్ హౌస్



గెస్ట్ హౌస్ వద్ద పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం

గాలివీడు : వెలిగల్లు జలాశయం వద్ద సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన గెస్ట్ హౌస్ నిరుపయోగంగా మారింది.బోటింగ్‌కు వెళ్లే దారిలో ప్రాజెక్ట్ పర్యవేక్షణ కోసం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన గెస్ట్ హౌస్ చుట్టూ కంపచెట్లు, పిచ్చిమొక్కలతో బూత్ బంగ్లాను తలపిస్తోంది. దీనిపై అధికారులు దృష్టి కేంద్రీకరించకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి గెస్ట్ హౌస్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

భుజంగరావు సేవలు చిరస్మరణీయం

కడప ఎడ్యుకేషన్ : మాజీ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు పసుపులేటి భుజంగరావు సేవలు చిరస్మరణీయమని ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీనివాసులు కొనియాడారు. భుజంగరావు వర్ధంతి సందర్భంగా ఆదివారం టీచర్స్ భవన్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. టీచర్స్ భవన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రాజగోపాల్, వెంకటసుబ్బయ్య, సుదర్శన్ రెడ్డి, భుజంగరావు కుమార్తె అనసూయమ్మ, కుటుంబ సభ్యులు ఆయన సేవలు గుర్తు చేసుకొన్నారు.

క్లుప్తంగా

నేడు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన



రైల్వేకోడూరు : రాష్ట్రంలో కల్తీ మద్యం కారణంగా ప్రజల ప్రాణాలు పోవడమే కాక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నకిలీ మద్యంపై రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా పెద్దఎత్తున ఉద్యమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు కోడూరులోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ద్విచక్ర వాహనదారులకు జరిమానా



వాహన తనిఖీ చేస్తున్న ఎస్ఐ రఫీ

సిద్ధవటం : మండలంలోని భాకరాపేట చెక్ పోస్టు వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీలో పది మంది ద్విచక్ర వాహనదారులకు రూ.1850 జరిమానా విధించినట్లు ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాల తనిఖీలో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, ఆర్‌సీ, సరైన రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించామన్నారు. హైవే రోడ్డుపై ట్రాఫిక్ రూల్స్ పాటించి వాహనాలు వెళ్లాలని అతివేగం ప్రమాదకరమని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ



పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

రాజంపేట టౌన్ : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఇటీవల కడపలో జరిగిన ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో రాజంపేటకు చెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభ కనబరచి పతకాలను సాధించారు. ఈ విషయాన్ని స్కేటింగ్ కోచ్ వినోద్‌కుమార్ ఆదివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈ పోటీల్లో రాజంపేట నుంచి పదిమంది క్రీడాకారులు పాల్గొనగా, ఆరుమంది పతకాలు సాధించారన్నారు. వీరిలో భువనేశ్వర్ గోల్డ్ మెడల్ సాధించగా, భవ్య బ్రాంజ్ మెడల్ సాధించింది. మను, తేజ్‌సాయి, మనస్విత, జమాల్‌వలీలు రెండు విభాగాల పోటీల్లో పాల్గొని రెండు విభాగాల్లోను సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో పది మంది క్రీడాకారులు పాల్గొనగా ఆరు మంది క్రీడాకారులు పతకాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని కోచ్ తెలిపారు.

ఈకేవైసీని చేయించుకోవాలి



ఈకేవైసీ చేస్తున్న ఏపీఓ మాలిక్ బాషా

సుండుపల్లె : మండల పరిధిలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉన్న వ్యక్తులందరూ ముఖ ఆధారిత ఈకేవైసీ ప్రక్రియను చేయించుకోవాలని మండల ఏపీఓ మాలిక్‌బాషా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనికి వెళ్లాలంటే ఈకేవైసీ ప్రక్రియను త్వరగా చేయించుకోవాలని లేకుంటే ప్రతిరోజు వేసే హాజరు నమోదులో తమ పేర్లు రావని అలాంటి వారు పనిచేసుకునేందుకు వీలుండదని ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలోకి ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆ గ్రామంలోని గ్రూపునకు సంబంధించిన మస్టర్లు రాసే మేట్లు ఈకేవైసీ ప్రక్రియను చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మల్లూరమ్మకు పూజలు



చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది వద్ద కొలువై ఉన్న శ్రీ మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధు మిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు.

పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న ఏపీఎన్‌జీఓ నాయకులు వెంకటేశ్వరరెడ్డి

రాయచోటి టౌన్ : పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకులు పీసీ రెడ్డెన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన రాయచోటి ఎన్‌జీఓ హోంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ (ఏపీజీపీఏ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో పోరాటానికి సిద్ధం కావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పెన్షనర్ల ఆరోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలు ఉన్నాయని కావున ఆర్థిక పరిష్కారం చూపాలని కోరారు. ఎన్జీఓ తాలూకా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్ల బకాయిలు విషయంలో ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొంటారని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల అభ్యున్నతికి ఎల్లవేళలా తమ అసోసియేషన్ పని చేస్తుందని చెప్పారు. అనంతరం పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎన్జీఓ అధ్యక్షులు కామ్రేడ్ ఎం.పెంచలయ్య మృతిపై సంతాపాన్ని తెలిపి మౌనం పాటించారు. ఈ నెల ఆఖరులో రాష్ట్ర ఎన్జీఓ నాయకులు అలపర్తి విద్యాసాగర్ జిల్లా కార్యవర్గ ఎన్నిక కోసం రాయచోటికి రానున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు వెంకటరమణ, రెడ్డికుమార్, జయచంద్రారెడ్డి, ఈశ్వరయ్య, చెంగల్ రెడ్డి, రాయచోటి తాలూకా సహాయక అధ్యక్షులు పల్లపు మహదేవ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే కాలపరిమితి సర్క్యులర్ రద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

రాయచోటి అర్బన్ : సీఐటీయూ అండతో వీఓఏలు చేసిన పోరాటాల ఫలితమే కాలపరిమితి సర్క్యులర్ రద్దు అయ్యిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటిలో ఏర్పాటు చేసిన సమావేశంలో జరిగిన వెలుగు యానిమేటర్ల జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో వీఓఏలకు నాణ్యమైన సెల్‌ఫోన్‌లు ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి తిరుపతయ్య మాట్లాడుతూ వీఓఏలు ఐక్యంగా పోరాడితే వారి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నంద్యాల వీఓఏల జిల్లా అధ్యక్షులు సోమన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, రామాంజులు, భాగ్యలక్ష్మి, సంఘం నాయకులు రెడ్డెప్ప రెడ్డి, కృష్ణమ్మ, సుబ్రమణ్యం పరంజ్యోతి, ఊతప్ప, పవన్, ఆనంద్, నిర్మల, నాగ సులోచన, శారద, జిల్లా నలుమూలల నుంచి యానిమేటర్లు పాల్గొన్నారు.

ప్రజాసేవ, దేశప్రగతే లక్ష్యాలు



సంబేపల్లె: ఉత్సవాలలో పాల్గొన్న స్వయం సేవకులు

చిన్నమండెం : ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు స్వయం సేవకులు ప్రజల ప్రాణాలను కాపాడటంలో ముందుంటారని ఆర్ఎస్ఎస్ బండి బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లూరమ్మ దేవస్థానం వద్ద రాయచోటి గ్రామీణ ఖండ మల్లూరు సంఘ్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బండి బాలాజీ మాట్లాడుతూ ప్రజా సేవ, దేశప్రగతి లక్ష్యాలుగా ఆర్ఎస్ఎస్ ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో పలువురు స్వయం సేవకులు పాల్గొన్నారు.

సంబేపల్లె : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నారాయణరెడ్డిపల్లె గ్రామం మంచాలమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది సంవత్సరం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, హిందూ చైతన్య వేదిక ప్రాంత సహ సంయోజక్ బండి బాలజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావడానికి 1925 లో కేశవ బలరాం హెగ్డే స్థాపించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం కోటి మందికి పైగా స్వయం సేవకులతో ప్రపంచంలోని అతి పెద్ద వాలంటరీ ఆర్గనైజేషన్‌గా ఉందన్నారు. దేశంలో ప్రతి వ్యక్తి దేశభక్తి కలిగి ఉండటం వల్ల భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవడానికి సాధ్యం అవుతుందన్నారు. ఎప్పుడైనా అతి పెద్ద విపత్తు సంభవించినప్పుడు సేవాభారతి, ఆరోగ్యభారతి, విద్యాభారతి తదితర సంస్థల ద్వారా స్వయం సేవకులు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడటానికి ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో స్వయం సయోజకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు



సంబేపల్లె: నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు



సిద్ధవటం: అలంకరణలో గంగాభవానీ

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం ముందు భాగంలో బీజాక్షరాలతో కలిగివున్న మహిమగల రాయిని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

అలంకరణలో బోయకొండమ్మ

సుండుపల్లె : మండల పరిధిలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ బోయకొండమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం ఉదయాన్నే పూజారి అమ్మవారికి పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



సుండుపల్లె: పూజలందుకున్న బోయకొండమ్మ

గంగాభవానికి పూజలు

సిద్ధవటం : మండలంలోని మాధవరం-1, బంగారుపేట గ్రామంలో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మవారికి ఆదివారం పసుపు, కుంకుమతో అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాడ వెంకటసుబ్బయ్య ఆదివారం మాట్లాడుతూ అమ్మవారికి పసుపు కుంకుమతో అలంకరించి పంచామృతాభిషేకాలు నిర్వహించామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు తీర్థప్రసాదాలు అందించామన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌బాబు

ఒంటిమిట్ట : మండల వైఎస్ఆర్‌సీపీ నాయకుడు తేలూరు వెంకటశేషారెడ్డి ప్రథమ కుమారుడు తేలూరు సాయినాథ్‌రెడ్డి వివాహ వేడుకకు అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సురేష్‌బాబు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మండల కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో జరుగుతున్న ఈ వివాహ వేడుకకు ఆయన హాజరయ్యారు. అనంతరం తేలూరి వెంకటశేషారెడ్డి కుటుంబసభ్యులను ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఆకేపాటి వెంకటశివారెడ్డి, చిట్టిపల్లి సుబ్బారెడ్డి, వీరశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి మారేళ్లలో ఉరుసు

కేవీపల్లె: మండలంలోని మారేళ్లలో ఈ నెల 16వ తేదీ నుంచి మూడు రోజులపాటు హజరత్ మహబూబ్ సుబహాని బాబా ఉరుసే షరీఫ్ ఉరుసు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 16న గంధం, ఫకీర్ల మెరవణి, ఫాతెహా ఖ్వానీ, 17న ఉరుసు, ఖవ్వాలీ పోటీలు ఉంటాయని తెలిపారు. 18న ఫాతెహా, జెండా ఊరేగింపు ఉంటుందని, హిందూ ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ఉరుసును జయప్రదం చేయాలని కోరారు.

నిధుల తవ్వకాలపై ఆరా

పెద్దతిప్పసముద్రం: మండలంలోని హంద్రీనీవా కాలువ దిగవ భాగాన గుర్తు తెలియని దుండగులు తవ్వకాలు చేపట్టిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం ఘటనా స్థలానికి చేరుకుని క్షుద్ర పూజలు చేసిన విధానాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో బలమైన రాతి బండలను తొలగించిన జేసీబీ వాహనం ఎవరిదనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

నిరుద్యోగ భృతి ఎక్కడ?

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఎప్పుడు ఇస్తారని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ ప్రశ్నించారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ నగర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 మాసాలు అవుతున్న నిరుద్యోగ యువత పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. పది సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ బ్లాక్ లాక్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ పోస్టుల నియామకాలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

నవంబరు 7న సెంటినరీ ఉత్సవాలు

మదనపల్లె సిటీ: నవంబరు 7న హాకీ ఇండియా సెంటినరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు హాకీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ హాకీ ఇండియా అసోసియేషన్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా హాకీ ఇండియా అసోసియేషన్ అక్టోబరు 7న మదనపల్లెలో బాల, బాలికలకు హాకీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొన్న జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులను ప్రత్యేకంగా సన్మానిస్తామన్నారు.

సాహిత్యాభివృద్ధికి 'బంగోరె' కృషి ఎనలేనిది



బండి గోపాల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న లెక్కల కొండారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్ : సాహిత్యాభివృద్ధికి రచయిత బండి గోపాలరెడ్డి ఎనలేని కృషి చేశారని కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి కొనియాడారు. ×బంగోరె≈ పేరుతో ఈయన ప్రసిద్ధి చెందారని తెలిపారు. బండి గోపాల్‌రెడ్డి 88వ జయంతిని ఆదివారం కడప రెడ్డి సేవా సమితి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కొండారెడ్డి మాట్లాడుతూ వేమన, సీపీ బ్రౌన్, మహాకవి గురజాడతోపాటు పలువురి సాహిత్య జీవితాలపై బంగోరె పరిశోధనలు చేశారని తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన బ్రౌన్ రీసెర్చ్ ప్రాజెక్టు ద్వారా సీపీ బ్రౌన్ సాహిత్య చరిత్రను, బ్రౌన్ లేఖలు–ఆధునికాంధ్ర సాహిత్య చారిత్రక శకలాలు అనే గ్రంథాలను గోపాలరెడ్డి వెలుగులోకి తెచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి, కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, గుడ్ల ఆదినారాయణరెడ్డి, మద్దిక సుబ్బిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సర్పంచ్ అక్రమాలపై విచారణ చేపట్టండి

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామ సర్పంచ్ జయరామకృష్ణారెడ్డి అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ సలహామండలి నాయకుడు సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. సర్పంచ్‌గా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, పెరియవరం గ్రామ పొలం సర్వే నెంబరు. 144, 145లలో జాతీయ రహదారికి పక్కనే 6.50 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించడంతోపాటు అనంతంపల్లి శ్మశాన స్థలాన్ని కూడా ఆక్రమించారన్నారు. పంచాయతీ పరిధిలోని చాపల దళితవాడలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన బోరు, మోటారు, పంపుసెట్లు, పైపులను ముక్కావారిపల్లికి చెందిన రైతుకు 62 వేలకు అమ్ముకోవడం జరిగిందని, అలాగే జానకీపురంలో రెండు సంవత్సరాల క్రితం మోటారు రిపేరు నెపంతో తీసుకెళ్లిన మోటారును ఇప్పటి వరకు బిగించలేదని, రోడ్లు వేయకుండా దొంగ బిల్లులు స్వాహా చేసినట్లు విమర్శలు చేశారు. ప్రశ్నించిన ప్రజలను మా ప్రభుత్వంలో మాకు ఎదురు చెబుతారా అంటూ దాడికి పాల్పడుతున్నారన్నారు. సర్పంచ్‌గా ఉంటూ ఐపీ పిటీషన్ దాఖలు చేసిన చరిత్ర జయరామకృష్ణారెడ్డిదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనంతంపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రకటనలో కోరారు.

బాల్య వివాహాలు నేరం



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

వీరబల్లి : బాల్య వివాహాలు చేసిన, చేయించిన నేరమని అధికారులు హెచ్చరించారు. ఆదివారం వీరబల్లి పంచాయతీలోని పెద్ద దళితవాడలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు గ్రామస్తులకు బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల ఆలోచన శక్తి లేకపోవడం, శారీరకంగా, మానసికంగా బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కుటుంబంలో అనేక సమస్యలకు కారణమవుతుందని, 21 సంవత్సరాలు వయస్సు వచ్చిన తరువాతనే వివాహం చేయాలని తెలియజేశారు. కాదని వివాహాలు జరిపిన వారిపై క్రిమినల్ కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ భాస్కర్, అధ్యాపకులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రసాద్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏ పంటకు గిట్టుబాటు ధరలేదు

మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఎదుట ఆవేదనను తెలియజేసిన గువ్వలచెరువు గ్రామ రైతులు



రైతులు, కార్యకర్తలతో గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : రామాపురం మండలం గువ్వలచెరువులో ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పర్యటించారు. గ్రామస్తులను పేరుపేరునా అందరినీ పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి రైతులు, ప్రజలతో మాట్లాడి సమస్యలను ఆరా తీశారు. రైతులు మాట్లడుతూ పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధరలు కూడా లేవని తెలిపారు. రైతులు కష్టాలు పడుతుంటే కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది రైతు భరోసాని ఎగ్గొట్టారని, పాల రేట్లు కూడా తగ్గాయని వారు శ్రీకాంత్ రెడ్డి ఎదుట వాపోయారు. ప్రజలకు ఏ కష్టం వచ్చిన తాము అండగా నిలుస్తామని శ్రీకాంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

గ్యార్మీ ఫతేహాలో శ్రీకాంత్ రెడ్డి

గువ్వలచెరువులోని శ్రీ షేక్ హాజీ హనీఫ్ అల్లుడు సయ్యద్ దస్తగిరి, వైఎస్ఆర్‌సీపీ రాయచోటి ఐటీ వింగ్ అధ్యక్షుడు షేక్ మస్తాన్ బాషాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్యార్మీ ఫతేహ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. దేవుడి దయతో ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిలాన్, డా.రమణ, కోఆప్షన్ మాజీ సభ్యులు ఫైరోజ్ అలీ, ఓబులేసు, ముబారక్, దర్బార్, బంకు సుబ్బయ్య, మాబు, మస్తాన్, కొత్తపల్లె బాబు, శేఖర్, జనార్ధన్ రెడ్డి, కుమార్, జానీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి శేషాద్రిరెడ్డికి న్యాయం చేయాలి



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రెడ్డి జాగృతి సంఘం నాయకులు

లక్కిరెడ్డిపల్లి : రిషీ వాటిక గురుకలం విద్యార్థి శేషాద్రి రెడ్డి కంటి చూపు కోల్పోవడం బాధాకరమని రెడ్డి జాగృతి వ్యవస్థాపకులు పిట్టి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రెడ్డి జాగృతి వ్యవస్థాపకుడు పిట్టి శ్రీనివాస్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నరేష్ చంద్రారెడ్డి, సెక్రటరీ సిద్దా రెడ్డి, యూత్ సెక్రటరీ కృష్ణమూర్తి రెడ్డిలు మండలంలోని కోనంపేట గ్రామం కాలాడివాండ్లపల్లిలో శేషాద్రి రెడ్డి అనే విద్యార్థి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థి శేషాద్రి రెడ్డి తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఒక విద్యా సంస్థలో పిల్లల భద్రత కాపాడాల్సిన స్థానం నుంచి ఇలాంటి చర్యకు పాల్పడటం సమాజానికి మచ్చని పేర్కొన్నారు.

ఈ ఘటనలో పాల్గొన్న వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శేషాద్రి రెడ్డికి అవసరమైన మెడికల్ ట్రీట్‌మెంట్‌ను ప్రభుత్వమే భరించాలన్నారు. అలానే కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలన్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై విచారణ వేగవంతం చేసి న్యాయం చేయాలని రెడ్డి జాగృతి సంఘం తరపున కోరారు.